క్లుప్తంగా

అర్హతే ఆధారంగా పథకాలను అందజేయాలి



మచిలీపట్నంటౌన్: ప్రతి ఒక్కరికీ అర్హతే ఆధారంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేయాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) సూచించారు. స్థానిక జెడ్పీ కన్వెన్షన్ హాల్లో శనివారం నగరంలోని పలు డివిజన్లలో నియమించిన డివిజన్ కన్వీనర్లు, గృహసారథుల సమన్వయ సమావేశం నిర్వహించారు. సమావేశంలో పాల్గొన్న పేర్ని నాని మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను కుల, మత, పార్టీ రహితంగా అందేలా చూడాలన్నారు. కన్వీనర్లు, గృహసారథులు వారి పరిధిలో సూక్ష్మస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. నగర మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ, డెప్యూటీ మేయర్ తంటిపూడి కవిత థామస్‌నోబుల్, మునిసిపల్ మాజీ చైర్మన్ షేక్ సలార్‌దాదా, వైఎస్సార్ సీపీ నాయకులు పేర్ని కృష్ణమూర్తి (కిట్టు), నగర కన్వీనర్లు గూడవల్లి నాగరాజు, చిటికిన నాగేశ్వరరావు, శీలం బాబ్జి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కార్తికేయుని ఆలయంలో భక్తుల రద్దీ



మోపిదేవి: స్థానిక వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం శనివారం భక్తులతో రద్దీ ఏర్పడింది. రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కళకళలాడింది. నాగపుట్ట, నాగమల్లివృక్షం పొంగళ్ల వద్ద భక్తులు క్యూలో గంటల తరబడి నిరీక్షించారు. ఆలయ ఏసీ ఎన్‌ఎస్ చక్రధరరావు ఆధ్వర్యంలో ఆలయ అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



ఘంటసాల(అవనిగడ్డ): డ్రగ్స్, మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని ఘంటసాల ఎస్‌ఐ కూచిపూడి శ్రీనివాస్ చెప్పారు. ఘంటసాల మండలం కొడాలి జెడ్పీ హైస్కూల్లో మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలు, రోడ్డు భద్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ హైస్కూల్ స్థాయి నుంచే కొంతమంది విద్యార్థులు మత్తు పదార్థాలకు అలవాటు పడుతున్నారని, ఇలా చేయడం వల్ల వారి జీవితాలను వారే నాశనం చేసుకుంటున్నారన్నారు. ద్విచక్ర వాహనాలను మైనర్లకు ఇవ్వ వద్దని ఇలా చేస్తే వారి తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని చెప్పారు. విద్యార్థులు ఏమి చేస్తున్నారో, ఎవరితో ఉంటున్నారో తల్లిదండ్రులు పరిశీలిస్తూ ఉండాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మురళీ పాల్గొన్నారు.

మట్టి ఖర్చులు అందజేత



పెడన: కవిపురం పీఏసీఎస్‌లో అప్పుదారులుగా ఉన్న ఇరువురు వ్యక్తులు ఇటీవల మృతి చెందడంతో వారి కుటుంబసభ్యులకు శనివారం మట్టిఖర్చుల కింద రూ.10వేల చొప్పున అందజేశారు. గురువిందగుంట గ్రామానికి చెందిన సోమ వెంకటసుబ్బమ్మ, కొంగంచర్ల గ్రామానికి చెందిన లోయి వెంకట సుబ్బమ్మలు ఇటీవల చనిపోయారు. వీరి కుటుంబసభ్యులకు పీఏసీఎస్ చైర్మన్ తిక్కిశెట్టి వెంకట సీతారామప్రసాద్‌బాబు నగదు అందజేశారు. కార్యక్రమంలో పుట్టి పైడేశ్వరరావు, మాజీ ఎంపీపీ అచ్యుతరావు, వైఎస్సార్ సీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆంజనేయులు, సొసైటీ కార్యదర్శి కృష్ణ శంకర్ పాల్గొన్నారు.

ఘంటసాలకు ఘన నివాళి



టేకుపల్లి(మోపిదేవి): గానగంధర్వుడు ఘంటసాల వెంకటేశ్వరావు అమరజీవిగా నిలిచారని కోసూరువారిపాలెం మాజీ ఉప సర్పంచ్ కోసూరు రామాంజనేయులు అన్నారు. మండల పరిధిలోని టేకుపల్లిలో ఘంటసాల విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. దేశ, విదేశాల్లో పేరు ప్రఖ్యాతులు సాధించిన ఘంటసాల దివిసీమ వాసులు కావడం మన అదృష్టమన్నారు. అనంతరం విద్యార్థులకు స్వీట్లు పంచారు.

పేదరికంలేని సమాజ నిర్మాణమే సీఎం లక్ష్యం

మంత్రి జోగి రమేష్



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న మంత్రి జోగి రమేష్, (ఇన్‌సెట్లో) ట్రాక్టర్ నడుపుతూ గడప గడపకూ వెళ్తున్న మంత్రి జోగి రమేష్

గూడూరు: రాష్ట్రంలో పేదరికం లేని సమాజ నిర్మాణమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. గూడూరు మండలం మల్లవోలు పంచాయతీ పరిధిలోని మల్లవోలు–2 గ్రామ సచివాలయం పరిధిలో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. మంత్రి జోగి రమేష్ మల్లవోలు గరువు, ముదిరాజుపాలెం, రెడ్డినాయుడు అగ్రహారం తదితర ప్రాంతాల్లో పర్యటించి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా పొందిన లబ్ధిని వివరిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంతకంతో కూడిన బ్రోచర్లను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఏ రాష్ట్రంలో అమలు కానన్ని సంక్షేమ పథకాలు మన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారన్నారు. పేద, మధ్యతరగతి ప్రజలు ఆర్థికంగా నిలదొక్కుకోవాలనే లక్ష్యంతో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. ఎలాంటి కల్మషం లేకుండా అందరినీ సమానంగా చూస్తూ రాష్ట్రాన్ని సంతోషాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని నిండు మనస్సుతో ఆశీర్వదించాలని మంత్రి ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

మరింత పక్కాగా అమలుకోసమే..

ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో అమలు తీరు తెలుసుకోవడం కోసమే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మంత్రి జోగి రమేష్ తెలిపారు. ప్రతి ఇంటికీ వెళ్లి వారి సమస్యలు తెలుసుకోవడంతో పాటు వారికి పథకాల ద్వారా కలుగుతున్న ప్రయోజనం తెలుసుకోమని జగనన్న పంపాడని ఆయన వెల్లడించారు. గ్రామంలోని మండల పరిషత్ పాఠశాలను సందర్శించిన మంత్రి విద్యార్థులతో ముచ్చటించారు. మీకు పుస్తకాలు, పెన్నులు, బట్టలు, బూట్లు, బెల్టు, టై ఎవరు ఇచ్చారని చిన్నారులను ప్రశ్నించగా... జగన్‌మామయ్య అంటూ విద్యార్థులు సమాధానం చెప్పడంతో మంత్రి వారిని అభినందించారు. బాగా చదువుకుని మంచి ఉద్యోగాలు సాధించాలని, తల్లిదండ్రులను బాగా చూసుకోవాలని ఆకాంక్షించారు. పాఠశాల స్లాబ్ పెచ్చులు ఊడి పడుతున్నాయని ఉపాధ్యాయులు మంత్రి దృష్టికి తీసుకెళ్లగా మండల పరిషత్ గ్రాంటు నుంచి మరమ్మతులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ సంగా మధుసూదనరావు, జెడ్పీటీసీ సభ్యుడు వేముల సురేష్ రంగబాబు, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పర్లం పెదబాబు, సర్పంచి బొర్రా సాంబశివయ్య, ఎంపీటీసీ సభ్యులు రామిరెడ్డి, సాయికుమారి, వైఎస్సార్ సీపీ నాయకులు రవి, రత్నారావు, కృష్ణ, కామేశ్వరరావు పాల్గొన్నారు.

రీ సర్వే ప్రక్రియ తనిఖీ



రీ సర్వే ప్రక్రియను పరిశీలిస్తున్న ఏడీ గోపాలరాజా

గూడూరు: జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష కార్యక్రమంలో భాగంగా గూడూరు మండలం కంకటావలో జరుగుతున్న రీ సర్వే పక్రియను జిల్లా సర్వే, లాండ్ రికార్డ్ విభాగం ఏడీ గోపాలరాజా శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయిలో సర్వే సిబ్బంది నిర్వహిస్తున్న గ్రౌండ్ ట్రూతింగ్ ప్రక్రియను ఆయన పరిశీలించి, పలు సూచనలు చేశారు. ప్రక్రియలో రైతులను భాగస్వామ్యం చేయాలని కోరారు. ప్రతి రైతు కమతాన్ని నమోదు చేయాలని ఆయన సిబ్బందిని ఆదేశించారు. రీ సర్వే ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలన్నారు. తద్వారా దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న భూ వివాదాలను శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. రైతులు కూడా అధికారులకు సహకారం అందించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో గ్రామ సర్వేయరు గోపి, వీఆర్వో వెంకటేశ్వరరావు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు పోతురాజు పాల్గొన్నారు.

ముగిసిన బ్లాక్ స్థాయి క్రీడల పోటీలు



విజేతలైన క్రీడాకారులతో నిర్వాహకులు

గుడివాడటౌన్: స్థానిక ఎస్‌పీఎస్ హైస్కూల్‌లో కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో శుక్ర, శనివారాలలో జరిగిన ఆటల పోటీలు ముగిశాయి. బాలురు, బాలికల విభాగాలకు కబడ్డీ, ఖో–ఖో, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా యువజన విభాగం అధికారి సుంకర రాము మాట్లాడుతూ గ్రామీణ స్థాయి నుంచి క్రీడాకారులను ప్రోత్సహించి జాతీయ క్రీడాకారులుగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించామన్నారు. ఇక్కడ విజేతలైన వారికి ఈ నెలాఖరులోపు జిల్లా స్థాయి పోటీలు నిర్వహిస్తామని, దశలవారీగా విజేతలు జాతీయ స్థాయికి చేరుకునే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో నందివాడ ఎంపీపీ పెయ్యల ఆదాం, ఎస్‌పీఎస్ హైస్కూల్ హెచ్‌ఎం టీఈ రాణి, వ్యాయామ ఉపాధ్యాయులు మడకా ప్రసాదు, కె.అనూరాధ, వద్దాది చారిటబుల్ ట్రస్ట్ అధినేత వద్దాది రాజేష్, ఎన్వైకే వినోద్, క్రీడాకారులు పాల్గొన్నారు.

అన్నసమారాధన కరపత్రాల ఆవిష్కరణ



అన్నసమారాధన కరపత్రాలు విడుదల చేస్తున్న కృష్ణప్రసాద్

పెదకళ్లేపల్లి(మోపిదేవి): మహాశివరాత్రి సందర్భంగా ఈ నెల 18వ తేదీన స్నేహ సొసైటీ, పెన్ సంయుక్త ఆధ్వర్యంలో పెదకళ్లేపల్లి వచ్చే వేలాది భక్తులకు ఉచిత అన్నసమారాధన నిర్వహించనున్నట్లు సొసైటీ అధ్యక్షుడు గంధం పద్మజా నాయుడు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ పెదకళ్లేపల్లి తూర్పు బజారు రైస్‌మిల్లు ఆవరణలో అన్న సమారాధన చేయనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం అన్నసమారాధన కరపత్రాలు విడుదల చేశారు. సొసైటీ కార్యదర్శి సామర్ల మల్లికార్జునరావు, సభ్యులు గంధం వీరాంజనేయులు, మారుబోయిన రామాంజనేయులు, సత్యానారాయణ, పెన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సింహాద్రి కృష్ణప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షుడు నాగేశ్వరావు పాల్గొన్నారు.

పరీక్షల నియంత్రణ అధికారిగా సుశీల

చిలకలపూడి(మచిలీపట్నం): కృష్ణా విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారిగా ఎల్.సుశీలను నియమిస్తూ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఎం.రామిరెడ్డి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. విశ్వవిద్యాలయంలో బయోసైన్సెస్, బయోటెక్నాలజీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఆమె విధులు నిర్వహిస్తున్నారు. అలాగే యూనివర్సిటీ ఏపీసీఎఫ్ఎస్ఎస్ ఎగ్జామినేషన్స్ లైజన్ ఆఫీసర్‌గా విశ్వవిద్యాలయంలోని ఇంజినీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ వి.సుజయ్‌ను నియమిస్తూ రిజిస్ట్రార్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

రేపు వ్యక్తిత్వ వికాస శిక్షణ తరగతులు

పెడన: సహాయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 13వ తేదీన పట్టణంలోని దేవాంగ కల్యాణ మండపంలో వ్యక్తిత్వ వికాశ శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు సంస్థ ప్రతినిధులు మట్టా రాధాకృష్ణమూర్తి, కాగిత సాంబశివరావు ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి పబ్లిక్ పరీక్షలకు విద్యార్థులు పాటించాల్సిన అంశాలపై విశ్రాంత డైట్ కళాశాల ప్రిన్సిపాల్ కస్తూరి ఆధ్వర్యంలో తరగతులు నిర్వహిస్తున్నట్లు వారు వెల్లడించారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించే శిక్షణ తరగతులకు 9,10 తరగతి విద్యార్థులు హాజరుకావచ్చని పేర్కొన్నారు.

పేద ఎస్టీలకు ఐవీఎం సాయం



సాయం అందిస్తున్న ట్రస్టీలు డాక్టర్ సురేష్, రోజా

చల్లపల్లి: పేద ఎస్టీలకు ఇండియా విలేజ్ మినిస్ట్రీస్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో సాయం అందించారు. శనివారం సాయంత్రం స్థానిక కోమలానగర్, నారాయణరావు నగర్‌లో ఉన్న రెండు మురికివాడల్లో జీవిస్తున్న ఎనభై పేద ఎస్టీ కుటుంబాల వారికి ఐవీఎం ట్రస్టీలు డాక్టర్ వేములపల్లి సురేష్, వేములపల్లి రోజా దంపతులు రూ.లక్ష వ్యయంతో నాణ్యమైన బియ్యం, నిత్యావసర సరుకులు అందజేశారు. కోవిడ్ మొదటి లాక్ డౌన్ నుంచి ఇక్కడి పేదల కష్టాలు గమనించి ప్రతి నెలా సరుకులు, బియ్యం అందిస్తున్నట్లు సురేష్ తెలిపారు. చిత్తుకాగితాలు ఏరుకుంటూ గుడారాల్లో దుర్భర జీవితం గడుపుతున్న పేద ఎస్టీలకు తమ వంతు సాయం అందిస్తున్నట్లు తెలిపారు.

క్రమశిక్షణతో కూడిన విద్యను అలవర్చుకోవాలి

నిమ్మకూరు(పామర్రు): క్రమశిక్షణతో కూడిన విద్యను విద్యార్థులు అలవర్చుకుని ఉన్నతులుగా ఎదగాలని మచిలీపట్నం బెల్ కంపెనీ జనరల్ మేనేజర్ డి.శేషదేవుడు అన్నారు. మండలంలోని నిమ్మకూరు గ్రామంలో గల ఏపీఆర్‌జేసీ గురుకుల కళాశాల వార్షికోత్సవ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన శేషదేవుడు మాట్లాడుతూ చదువుతో పాటుగా విద్యార్థులు ఆటలలో కూడా ఉత్తమ ప్రతిభ కనబర్చే విధంగా శిక్షణ ఇవ్వాలని అన్నారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. కళాశాల ప్రిన్సిపాల్ సి.ప్రదీప్‌కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ట్రెజరర్స్ అండ్ అకౌంట్స్ డైరెక్టర్ ఎస్.మోహన్‌రావు, మైలవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రవి, ఎస్ఆర్ఎస్‌వీ బీఎడ్ కళాశాల అధ్యాపకుడు కె.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 1941 కేసుల పరిష్కారం



కేసులు పరిష్కరిస్తున్న జిల్లా జడ్జి తదితరులు

గుడివాడటౌన్: రాజీమార్గమే రాజమార్గమని 11వ అదనపు జిల్లా జడ్జి జి.రజని అన్నారు. స్థానిక కోర్టు ప్రాంగణంలో శనివారం మండల న్యాయ సేవాధికార కమిటీ ఆధ్వర్యంలో లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కక్షిదారుల సౌకర్యార్థం మొత్తం నాలుగు బెంచీలు ఏర్పాటు చేశామని అందులో సివిల్– 19, క్రిమినల్– 1844, ప్రీలిటిగేషన్ కేసులు–78 కేసులు పరిష్కరించామన్నారు. వీటి విలువ సుమారు రూ.83 లక్షల 15 వేలు అని ఆమె తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి ఎ.పూర్ణిమ, జూనియర్ సివిల్ జడ్జి సీహెచ్ కిషోర్‌కుమార్, ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కె.నాగలక్ష్మి, సెకండ్‌క్లాస్ మెజిస్ట్రేట్ బి.శ్రీదేవి, పోలీస్, బ్యాంకు, ఇన్సూరెన్స్ కంపెనీ అధికారులు, కక్షిదారులు పాల్గొన్నారు.

856 కేసులు పరిష్కారం

కైకలూరు: రాజీ మార్గం ద్వారా కేసులను పరిష్కరించుకోవడం ఉత్తమమని సీనియర్ సివిల్ కోర్టు జడ్జి జి.షణ్ముఖరావు చెప్పారు. కైకలూరు కోర్టులో జూనియర్ సివిల్ కోర్టు జడ్జి కె.శ్రీహరితో కలసి జాతీయ లోక్ అదాలత్‌ను శనివారం నిర్వహించారు. ముందుగా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా కక్షిదారులకు చట్టాలపై అవగాహన కలిగించారు. అనంతరం మనోవర్తి, క్రిమినల్, గృహహింస, చెక్‌బౌన్సు, ఎస్‌టీసీ వంటి 856 కేసులను రాజీమార్గం ద్వారా పరిష్కరించి, కక్షిదారులకు రూ.37,91,924 నగదును పరిహారంగా అందించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తెలగంశెట్టి శ్రీనివాసరావు, ఏపీపీ వడ్లాని శ్రీరామచంద్రమూర్తి పాల్గొన్నారు.

కిశోర బాలికలకు అవగాహన సదస్సు



బాలికలకు సూచనలు ఇస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

పెడన: బల్లిపర్రు మండల పరిషత్ పాఠశాలలో కిశోరబాలికలకు శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో విద్య, వ్యక్తిగత పరిశుభ్రత, పోషకాహారం అంశాలపై అవగాహన కల్పించారు. ఫోన్‌లు, వాట్సప్, ఫేస్‌బుక్ చాటింగ్‌లో జరిగే సైబర్ నేరాలు, ఇబ్బంది కరమైన పరిస్థితులు ఎదురైనప్పుడు దిశ యాప్ ద్వారా సాయం పొందవచ్చన్నారు. దీంతో పాటుగా టోల్ ఫ్రీ నెంబర్లు 181, 100, 1098కు ఫోన్ చేసి కూడా ఆపద నుంచి బయటపడవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం మమత, అంగన్‌వాడీ కార్యకర్తలు సుజాత, మహాలక్ష్మి, ఉయ్యూరమ్మ పాల్గొన్నారు.

గాయపడిన మహిళ మృతి

పెడన: వంట చేస్తుండగా ప్రమాదవశాత్తూ చీరకు నిప్పు అంటుకుని తీవ్రంగా గాయపడిన వల్లభపరపు సక్కుబాయి(71) అనే మహిళ మృతి చెందింది. పెడన పోలీసుల కథనం మేరకు ఉప్పలకలవగుంట గ్రామానికి చెందిన సక్కుబాయి తన కుమార్తె వల్లభపరపు కుమారితో కలిసి నివసించేది. శుక్రవారం కుమారి బట్టలు ఉతికేందుకు వెళ్లిన సమయంలో సక్కుబాయి వంటకు ఉపక్రమించగా.. ఈ దుర్ఘటన చోటు చేసుకుంది. వెంటనే క్షతగాత్రురాలిని బందరు ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స అందించారు. చికిత్స పొందుతూ ఆమె శనివారం మృతి చెందింది. కుమారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కృష్ణానదిలో జెట్టీ నిర్మాణం చేపట్టాలి

నాగాయలంక: స్థానిక కృష్ణానదిలో మత్స్యకారుల జీవనం మెరుగు పడేందుకు దోహదపడే విధంగా జెట్టి నిర్మాణం చేపట్టాలని తీరం గంగపుత్ర మెరైన్ ఫిషర్‌మెన్ సొసైటీ ప్రెసిడెంట్, నియోజకవర్గం బీసీ సంఘం అధ్యక్షుడు కోలా హరికృష్ణ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మత్స్యకారుల సమస్యలు, జెట్టి నిర్మాణ ఆవశ్యకతపై రాష్ట్ర మత్స్యశాఖ మంత్రి డాక్టర్ సిదిరి అప్పలరాజుకు వినతి సమర్పించినట్లు శనివారం ఆయన తెలిపారు.

‘ప్రియమైన ఏసుకు ప్రేమతో’ పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నాగార్జున యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కరుణ, ప్రొఫెసర్ మాధవి

కోసూరువారిపాలెం(మోపిదేవి): మండలంలోని కోసూరువారిపాలెం బేతేలు ప్రార్థనా మందిరంలో ‘ప్రియమైన ఏసుకు ప్రేమతో’ పుస్తకాన్ని శనివారం ఆచార్య నాగార్జున యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి.కరుణ, నాగార్జున యూనివర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ ఇరపని మాధవి ఈ పుస్తకాన్ని ఆవిష్కరించారు. అవనిగడ్డలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న కోసూరుపాలేనికి చెందిన రచయిత డాక్టర్ సనకా ప్రవీణను సన్మానించారు. అనంతరం పాస్టర్ కోసూరు ప్రభుకుమార్, కోసూరు శ్రీనివాసరావు పర్యవేక్షణలో ఏసుక్రీస్తు ప్రార్థనలు ఆలపించారు. కె.బోయజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో విజయవాడకు చెందిన సీయోను ప్రార్థన మందిరం దైవ సేవకులు ఆర్ బెనర్జీ కుమార్, ఏలూరు డిగ్రీ కళాశాల తెలుగు అధ్యాపకులు గుండ్లూరు వెంకట రమణ, తైక్వాండో బ్లాక్ బెల్ట్, గోల్డ్ మెడలిస్ట్ బీ వేణుబాబు, కోసూరు మధుబాబు, స్థానిక సర్పంచ్ కోసూరు అనూష, నాగాయితిప్ప సర్పంచ్ గరికిపాటి వెంకటేశ్వరావు(బుల్లి) పాల్గొన్నారు.

శివరాత్రికి 100 ప్రత్యేక బస్సులు

మచిలీపట్నంటౌన్: జిల్లాలోని మచిలీపట్నం, అవనిగడ్డ డిపోల నుంచి ఈ నెల 18వ తేదీ మహాశివరాత్రి సందర్భంగా 100 ప్రత్యేక బస్సులు నడుపనున్నట్లు జిల్లా ప్రజారవాణాధికారి జి. నాగేశ్వరరావు తెలిపారు. స్థానిక బస్టాండ్‌లోని ప్రజారవాణాధికారి కార్యాలయంలో శనివారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రత్యేక బస్సులకు కూడా సాధారణ చార్జీలను వసూలు చేస్తామన్నారు. పెదకళ్లేపల్లి, ఐలూరుల్లోని శివాలయాలకు వెళ్లే ప్రయాణికుల సౌకర్యార్థం ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశామన్నారు. అవనిగడ్డ, మచిలీపట్నం నుంచి పెదకళ్లేపల్లికి, మచిలీపట్నం, ఉయ్యూరుల నుంచి ఐలూరుకు బస్సులను తిప్పుతామన్నారు. గత ఏడాది 80 బస్సులు తిప్పామని ప్రయాణికుల రద్దీ అధికంగా ఉన్న దృష్ట్యా ఈ ఏడాది 100 బస్సులను తిప్పేందుకు నిర్ణయం తీసుకున్నామన్నారు. అవనిగడ్డ, మచిలీపట్నం నుంచి పెదకళ్లేపల్లికి 50 బస్సులు, మచిలీపట్నం, ఉయ్యూరు నుంచి ఐలూరుకు 50 బస్సులు తిప్పుతామన్నారు. సమావేశంలో డిపో మేనేజర్ టి పెద్దిరాజు పాల్గొన్నారు.

శివరాత్రి ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

కైకలూరు: కలిదిండి శ్రీ పాతాళ భోగేశ్వరస్వామి మహాశివరాత్రి ఉత్సవాల పోస్టర్‌ను ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) శనివారం తన నివాస గృహం వద్ద ఆవిష్కరించారు. ఆలయ ఈవో శింగనపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ సుమారు లక్ష మంది భక్తులు శివరాత్రికి స్వామిని దర్శించుకునే అవకాశం ఉందన్నారు. ఆలయం వద్ద భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలిగించకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. అందరూ సమన్వయంతో పనిచేసి శివరాత్రి వేడుకలను జయప్రదం చేయాలని కోరారు.

క్రైస్తవుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

పామర్రు: క్రైస్తవుల సంక్షేమమే పరమావధిగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పరిపాలన చేస్తోందని ఏపీ క్రైస్తవ సంక్షేమ సంఘ అధ్యక్షుడు సాల్మన్ కొల్లాబత్తుల అన్నారు. స్థానిక చాట్లవానిపురంలోని విజన్ లైఫ్ సెంటర్‌లో శనివారం నియోజకవర్గ స్థాయి పాస్టర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాస్టర్ల సంక్షేమం కోసం ఎన్నో వినూత్న పథకాలను ప్రవేశపెట్టి ప్రభుత్వం అమలు చేస్తోందని అన్నారు. కార్యక్రమంలో ఎం.మోషే, వై.సంగీతరావు, ఎన్.సామ్యూల్, వి.సునీల్, బీవి సాగర్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కళాజాతా

ఐనంపూడి(పామర్రు): నాబార్డు వారి సౌజన్యంతో కృష్ణాజిల్లా సహకార కేంద్ర బ్యాంక్ లిమిటెడ్ ఆదేశాల మేరకు మండలంలోని ఐనంపూడి గ్రామ పీఏసీఎస్ వద్ద శనివారం కళాజాతా కార్యక్రమం నిర్వహించారు. బిళ్లపాడు గ్రామానికి చెందిన కళాభారతి బృంద కళాకారులు కళాజాతా కార్యక్రమాన్ని అద్భుతంగా చేశారు. బ్యాంక్ వారు రైతులకు అందిస్తున్న వ్యవసాయ రుణాలు, ప్రధాన మంత్రి జీవన జ్యోతి బీమా, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, నగదు రహిత లావాదేవీలు, సైబర్ నేరాలను ఏ విధంగా అరికట్టాలి, వివిధ రంగాల వారికి అందిస్తున్న రుణ సౌకర్యాలు తదితర విషయాలపై కళాకారులు పాటల ద్వారా, వీధి నాటికల ద్వారా కళాజాతా కార్యక్రమం నిర్వహించారు.

గంజాయి విక్రయాలపై పోలీసుల ఉక్కుపాదం

రెండున్నర కిలోల గంజాయి స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ మహబూబ్ బాషా



పట్టుబడిన గంజాయి

చల్లపల్లి: గంజాయి విక్రయాలపై ఉక్కుపాదం మోపినట్లు అవనిగడ్డ డీఎస్పీ మహమ్మద్ మహబూబ్ బాషా తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ రేపల్లెకు చెందిన మల్లవోలు ఆదిశేషు, మల్లవోలు వెంకటేశ్వరమ్మ దంపతులు విజయవాడలో గుర్తు తెలియని వ్యక్తుల వద్ద నుంచి రేపల్లె, చల్లపల్లి పరిసర గ్రామాల్లో అమ్ముతూ యువతను గంజాయికి బానిసలుగా మార్చుతున్నట్లు తెలిపారు. వీరిద్దరి వద్ద చల్లపల్లికి చెందిన కోట అనిల్‌కుమార్, చిలక అజయ్, మరో ఇద్దరు గంజాయిని కొని నలుగురు కలిసి చల్లపల్లి పరిసర ప్రాంతాల్లో అమ్ముతున్నట్లు తెలిపారు. ఈ మేరకు అందిన పక్కా సమాచారంతో చల్లపల్లి ఇన్‌చార్జి సీఐ జి.శ్రీనివాసు, ఎస్‌ఐ సీహెచ్ చినబాబు ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది నిఘా వేసి శుక్రవారం రాత్రి నాగాయలంక రోడ్డులోని ప్రభాకరరావు రైస్‌మిల్లు వద్ద ఈ ఆరుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రెండున్నర కిలోల గంజాయి, మూడు సెల్ ఫోన్లు, రూ.3,010 స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులను కోర్టుకు తరలించి, వారిలో ఇద్దరు మైనర్లను జువైనల్ హోంకు తరలించనున్నట్లు డీఎస్పీ తెలిపారు. సమావేశంలో సీఐ జి.శ్రీనివాసు, ఎస్‌ఐ సీహెచ్.చినబాబు, ఏఎస్‌ఐ లక్ష్మణరాజు పాల్గొన్నారు.